క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. డాన్‌బాస్కో ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మైకెల్ కాలనీ, వినాయక్‌నగర్, డీడీ కాలనీ, కాళీమందిర్, ఎస్ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయానగర్, అరుణోదయనగర్, సంధ్యానగర్, జీఆర్ నగర్, మంచన్‌పల్లి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అప్పా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అప్పా అకాడమీ, ఉమాపతిఫామ్‌హౌజ్, గెస్ట్‌హౌజ్, హెర్బల్ గార్డెన్, అజీజ్‌నగర్, డీర్ పార్క్ తదితరులు ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

హుడా కాలనీ ఫీడర్ పరిధిలో..

రాజేంద్రనగర్: హుడా కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హుడా కాలనీ, పాండురంగానగర్, శివాజీనగర్, సీసీఎండీ, సిక్‌చానీ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శంషాబాద్ రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మీ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరు కానున్నట్లు తెలిపారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి



విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాలకిషన్

మణికొండ: పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లు, వాటి సామర్థ్యాలను పెంచాల్సిన అవసరం ఉందని లాలమ్మ గార్డన్ కాలనీ ప్రధాన కార్యదర్శి బాలకిషన్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తమ కాలనీలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయన్నారు. సమస్యను నివారించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆయన ఏఈ జ్ఞానేశ్వర్‌ను కోరారు. శుక్రవారం ఆయనను కలిసి ఈ మేరకు కాలనీ వాసుల తరపున వినతిపత్రాన్ని అందజేశారు. త్వరలోనే లాలమ్మ గార్డన్ కాలనీ విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు హైటెక్స్‌లో హైదరాబాద్ డెంటల్ షో

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో హైదరాబాద్ డెంటల్ షోను ప్రారంభించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా దంత నిపుణులు పాల్గొననున్నారు.రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనలో ప్రాక్టీషనర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు, డెంటల్ ఎక్విప్‌మెంట్, మెటీరియల్, ల్యాబ్‌లు, తయారీదారులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు.

రేపు శాంతిసరోవర్‌లో అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఆదివారం 'అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్' నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మకుమారీస్ అడ్మినిస్ట్రేటర్స్ వింగ్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 'వాల్యూస్ అండ్ స్పిరిచ్యువాలిటీ ఫర్ బెటర్ గవర్నెన్స్' అనే అంశంపై ప్రత్యేక సెమినార్‌ను నిర్వహిస్తారు. ఈ సెమినార్‌లో న్యూఢిల్లీ అడ్మినిస్ట్రేటర్స్ వింగ్ చైర్‌పర్సన్ రాజయోగిని బీకె ఆషాదీదీ కీలకోపన్యాసం చేస్తారు. పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అధార్‌సిన్హా, రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్‌కుమార్, రెరా చైర్మన్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ పాల్గొంటారు. కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందుకోసం వెబ్‌సైట్ www.shantisarovar.orgలో నమోదు చేసుకోవాలి.

డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్ ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజుల పాటు నిర్వహించనున్న డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు అనిత అగర్వాల్ మాట్లాడుతూ పలువురు డిజైనర్లు రూపొందించిన ప్రత్యేక డిజైన్‌లు, వివాహాది శుభకార్యాలకు వివిధ రకాల వస్త్రాలు, ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

ఫలించిన నిరీక్షణ

- త్వరలో ప్రారంభం కానున్న నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం
- రూ.7.73 కోట్ల వ్యయంతో నిర్మాణం..
- ఆగస్టు నెలలో అందుబాటులోకి..



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయం

బండ్లగూడ: బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల నిరీక్షణ ఫలించనుంది. అత్యాధునిక వసతులతో నిర్మించిన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం త్వరలోనే అందుబాటులోకి రానుంది. నూతన భవన నిర్మాణ స్థలం విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురుకావడంతో కొంత జాప్యం జరిగింది. అడ్డంకులు తొలగడంతో ఆగస్టు నెలలో నూతన భవనాన్ని ప్రారంభించేందుకు కార్పొరేషన్ అధికారులు సన్నాహాలు చేపట్టారు. ఈ మేరకు కిస్మత్‌పూర్‌లో చేపట్టిన నూతన కార్పొరేషన్ కార్యాలయ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

2.17 ఎకరాల్లో రూ. 7.73 కోట్లతో..

కిస్మత్‌పూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 181లో 2.17 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ. 7.73 కోట్ల అంచనా వ్యయంతో గత సంవత్సరం ఏప్రిల్ నెలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

ప్రత్యేక డిజైన్, అత్యాధునిక వసతులు..

సువిశాల ప్రాంగణంలో ప్రత్యేక డిజైన్, అత్యాధునిక సదుపాయాలతో ప్రజలకు, ఉద్యోగులకు సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. నూతన భవన నిర్మాణ పనులు త్వరలోనే పూర్తికానున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన అన్ని సేవలు ఇక్కడి నుంచే అందుతాయి.

ప్రతి విభాగానికి ప్రత్యేక చాంబర్లు

మేయర్ చాంబర్‌తో పాటు డిప్యూటీ మేయర్, కమిషనర్ చాంబర్, రెండు కౌన్సిల్ హాల్‌తో పాటు ఇతర విభాగాలు టౌన్‌ప్లానింగ్, మేనేజర్, శానిటరీ, ఇంజనీరింగ్ విభాగాలు రెవెన్యూ సెక్షన్, అకౌంట్స్, సిటీజన్ కౌంటర్, ఇన్‌వార్డు, బీడీఎస్ఆర్ సెక్షన్, కంప్యూటర్ సెక్షన్, మెప్మా, తదితర అధికారుల సిబ్బందికి విభాగాల వారీగా 18గదులతో పాటు మరిన్ని అదనపు గదుల నిర్మాణంతో పాటు విశాలమైన వాహనాల పార్కింగ్ ఉంటుంది.

త్వరలో అందుబాటులోకి తెస్తాం..



మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు పౌర సేవలు చేరువ చేయాలన్న ఉద్దేశంతో నూతన భవన నిర్మాణంపై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాము. ఆయన కృషితో ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి సువిశాలమైన స్థలంలో నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనం నిర్మించాము. అతి త్వరలో పనులు పూర్తి చేసి ఆగస్టు నెలలో భవనం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

–బుర్ర మహేందర్‌గౌడ్. మేయర్ బండ్లగూడ జాగీర్

అత్యాధునిక వసతులు



నూతన కార్యాలయంలో అత్యాధునిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి చేసి అతి త్వరలో కార్పొరేషన్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–బచ్చలకూరి శరత్ చంద్ర
కమిషనర్ బండ్లగూడ జాగీర్

ఘనంగా గాలి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన గాలిపోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామునుంచే దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటి సభ్యులు తదితులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులు అందజేసిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సాయిప్రసాద్‌రావు అన్నారు. సర్వీస్ నావ్, యూత్ ఫర్ సేవా ఎన్‌జీవో సంస్థలు సంయుక్తంగా పాఠశాలలో చదువుతున్న 100 మంది విద్యార్థులకు శుక్రవారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ కో ఆర్డినేటర్ సి.హెచ్.చరణ్‌ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు శివకృష్ణ, శ్రీకాంత్, గోవర్ధన్, ధనుష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనాల జాతరకు దేవాలయాల ముస్తాబు



రాజేంద్రనగర్ దేవాలయం వద్ద బోనాల పండుగ ఏర్పాట్లు

రాజేంద్రనగర్: ఆషాఢమాసం బోనాల జాతరకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. దేవాలయాల కమిటీ సభ్యులు దేవాలయాలను వివిధ రంగులతో అందంగా అలంకరిస్తున్నారు. గత వారం రోజులుగా ఆలయాలకు కొత్తగా పెయింటింగ్ వేయడంతో పాటు అమ్మవారి ఇతర దేవతామూర్తుల చిత్రాలతో తీర్చిదిద్దుతున్నారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌ల పరిధిలో దాదాపు 155పైగా అమ్మవారి దేవాలయాలు ఉన్నాయి. ఆయా దేవాలయాల వద్ద ఆషాఢమాసం సందర్భంగా స్థానిక భక్తులు తొట్టెల సమర్పించడంతో పాటు బోనం నైవేద్యంగా సమర్పిస్తుంటారు. జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక కమిటీల సభ్యులు ఉత్సవాల విజయవంతానికి తమవంతు కృషి చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

మణికొండ: పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వారు లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సకాలంలో దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు యాలాల నరేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రాచూరి రాజశేఖర్ తదితరులు

అత్తాపూర్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నామని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి, శక్తి కేంద్రం ఇన్‌చార్జీ రాచూరి రాజశేఖర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ లాల లజపత్‌రాయ్ శక్తి కేంద్రంలో శుక్రవారం బూత్ అధ్యక్షుడు అన్మూర్‌బన్సలీ, సంతోష్‌వర్మలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వీధిదీపాలు వెలగడం లేదని వారి దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులతో చర్చించి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా రాచూరి రాజశేఖర్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయాలని కోరామన్నారు. వారు సానుకూలంగా స్పందించి సిబ్బంది మురళీ, వారి సహచరులతో పనులను చేయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సంఘానికి ఫర్నిచర్ అందజేత



దాతను సన్మానిస్తున్న మహిళా సంఘం సభ్యులు

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని కేబీ.దొడ్డి గ్రామ మహిళా సంఘానికి ప్రభాకర్‌గౌడ్ శుక్రవారం ఫర్నిచర్‌ను అందజేశారు. సంఘం భవనంలో మహిళల సౌకర్యార్థం కుర్చీలు, టేబుల్, అల్మారాను అందజేశారు. ఎమ్మెల్యే సహకారంతో కొత్తగా నిర్మించిన మహిళా సంఘం భవనంలో ఫర్నీచర్ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ దండు ఇస్తారి అన్నారు. ఈ సందర్భంగా దాత ప్రభాకర్ గౌడ్‌ను మహిళా సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చంద్రశేఖర్, కృష్ణ, నాయకులు మల్లికార్జున్, గోపాల్, పాండురంగారెడ్డి, బల్వంత్ రెడ్డి, రాజు, సిద్దిఖ్, శివకుమార్‌గౌడ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ, కౌన్సిలర్లు

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

మణికొండ: మండల పరిధిలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గండిపేట మండల పరిధిలో గురువారం ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం కూడా కొనసాగాయి. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయాల సందడి నెలకొంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, కోకాపేట, గండిపేటలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రైం కార్నర్..

లైంగిక దాడిలో నిందితుడికి 25 ఏళ్ల జైలు

రాజేంద్రనగర్: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ ఆటో డ్రైవర్‌కు ఉప్పర్‌పల్లి కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురం ప్రాంతానికి చెందిన మహ్మద్ యూసుఫ్ ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. అతను 2017 ఆగస్టు 7న తన పక్కింట్లో ఉంటున్న బాలిక (17)ను ఆటోలో గుల్బర్గా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసుపై విచారణ చేపట్టిన ఉప్పర్‌పల్లి కోర్టు నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

మరో కేసులో..

నిందితుడికి 10 ఏళ్ల జైలు

ఇంటి ముందు ఆడుకుంటున్న బాలిక(4)పై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఉప్పర్‌పల్లి కోర్టు శుక్రవారం పదేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. నార్సింగి పోలీస్‌స్టేషన్ గంధంగూడ ప్రాంతానికి చెందిన నాగరాజు తన ఇంటి పక్కనే ఉంటున్న నాలుగేళ్ల బాలికను కేక్ ఇస్తానని ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లికి చెప్పడంతో ఆమె నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

వ్యక్తి కిడ్నాప్

- ఆర్థిక లావాదేవీలే కారణం

శంషాబాద్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హిమాయత్‌నగర్‌కు చెందిన చిరంజీవి అనే వ్యక్తిని ఈ నెల 12 రాత్రి శంషాబాద్ పట్టణం, మధురానగర్ కాలనీకి చెందిన కృష్ణ, సుధాకర్ అనే ఇద్దరు వ్యక్తులు ఫార్చునర్ కారులో ఎక్కించుకుని శంషాబాద్ బయలుదేరారు. మార్గ మధ్యలో కారులోనే అతడిని తీవ్రంగా చితకబాదారు. అనంతరం గుర్తు తెలియని మరో వ్యక్తిని అత్తాపూర్ సమీపంలోని హీరో హోండా షో రూం వద్దకు పిలిపించారు. అతడికి రూ. 26 లక్షలు బాకీ ఉన్నట్లు రూ.100 బాండ్‌పై రాయించుకున్నారు. అంతే కాకుండా చిరంజీవి నుంచి తమ కుటుంబానికి హాని ఉందంటూ బెదిరించి సంతకాలు చేయించుకున్నారు. వారి బారి నుంచి తప్పించుకున్న చిరంజీవి శుక్రవారం రాత్రి ఆర్‌జీఐఏ పోలీసులను ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

అత్తాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ పోలీస్ ఆకాడమీ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కిషన్ జీ కథనం మేరకు వివరాలలిలా ఉన్నాయి. నేషనల్ పోలీస్ అకాడమీ నుంచి ఓ వ్యక్తి (35) రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని 6,7,8వ డివిజన్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్తచెదారాలను వేయవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారన్నారు. అయితే కొందరు చెత్తచెదారాలను తీసుకువచ్చి రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో వేస్తుండటంతో పరిసరాలన్ని దుర్గంధభరితంగా మారుతున్నాయన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాను పెంచండి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఫెడరేషన్ నాయకులు

మణికొండ: మణికొండలోని పలు కాలనాల్లో గతంలో గంటన్నర పాటు సరఫరా చేసే నీటి ప్రస్తుతం అరగంట, 40 నిముషాలకు కుదించటంతో ఆయా కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జలమండలి జీఎం రవీందర్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ఓ వైపు సరిపడా నీటిని సరఫరా చేయకుండా బిల్లులను మాత్రం బలవంతంగా వసూలు చేయిస్తున్నారన్నారు. బిల్లులు చెల్లించే వరకు వెళ్లమని, లేదంటే కనెక్షన్ కట్ చేస్తామని సిబ్బంది బెదిరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో సీవరేజీ పనులను మున్సిపాలిటీ సిబ్బంది చేస్తున్నారని, వారికి జీతాలు కూడా మున్సిపాలిటీ చెల్లిస్తుందన్నారు. అయినీ జలమండలి సీవరేజీ బిల్లులు వసూలు చేస్తుండటం దారుణమన్నారు. బోనాల పండగ నేపథ్యంలో నీటి సరఫరా సమయాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు, కోశాధికారి బాబు రావు, పలు కాలనీల వాసులు పాల్గొన్నారు.

బోనాల జాతరను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలతరెడ్డి

రాజేంద్రనగర్: బోనాల పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలతరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి ఆమె మధుబన్ కాలనీలో దేవాలయ కమిటి సభ్యులు, యువజన సంఘాలు, కుల సంఘాలు, యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ సందర్భంగా దేవాలయాలతో పాటు ఊరేగింపుల సమయంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సామూహిక, ఫలహారం బండ్ల ఊరేగింపులో పోలీసులకు సహకరించాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. దేవాలయం కమిటి సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు.

ఏసీపీగా రాంచందర్ రావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు



ఏసీపీని సన్మానిస్తున్న టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

శంషాబాద్: శంషాబాద్ ఏసీపీ నియమితులైన రాచందర్‌రావు శుక్రవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా ఏసీపీగా పని చేసిన వి. భాస్కర్ నుంచి ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో పౌరులు బాధ్యతగా ఉండాలని సూచించారు.

ఏసీపీకి సన్మానం

శంషాబాద్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన రాంచందర్‌రావును శుక్రవారం తెలంగాణ సామాజిక స్టూడెంట్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో అనిల్ యాదవ్,మహేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.